క్లుప్తంగా

పనుల్లో నాణ్యత తప్పనిసరి



కొక్కిరాపల్లిలోని అంగన్‌వాడీ భవనం శ్లాబ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ

జి.మాడుగుల: మండలంలోని పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామంలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలన్నారు. భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రహదారి కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న జర్రెలపోదర్ గ్రామస్తులు

ముంచంగిపుట్టు: గ్రామానికి రహదారి నిర్మించాలని డిమాండ్ చేస్తూ రంగబయలు పంచాయతీ జర్రెలపోదర్ గ్రామస్తులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కళ్యాణం, జయరాం తదితరులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి రహదారి సమస్యతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణానికి సామగ్రి తరలించే వీలు ఉండడం లేదని, అత్యవసర సేవలైన 108, 104 గ్రామానికి వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యుత్ భద్రతా దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

కూనవరం: కూనవరం సెక్షన్ పరిధి భీమవరం సబ్‌స్టేషన్ వద్ద సోమవారం విద్యుత్ భద్రతా దినోత్సవ కార్యక్రమాన్ని జేఈ గెల్లంకి రాజ్‌కపూర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్–1912ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీనెల 2వ తేదిన విద్యుత్ భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ భద్రతకు సంబంధించి పలు సూచనలిచ్చారు. భద్రతకు స్వాగతం పలుకుదాం, ప్రమాదాలకు స్వస్తి పలుకుదాం అంటూ సిబ్బంది ద్వారా ప్రతిజ్ఞ చేయించారు.పలువురి విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు ఝూన్సీ, రామిరెడ్డి తదితరులు

రంపచోడవరం: పోరాటాలతోనే హక్కుల సాధించుకోగలమని, కొండమొదలు ప్రాంతంలో నాటి పోరాటాల ఫలితంగానే భూముల సాగు హక్కులను సాధించుకున్నామని, ప్రధాన జీవన ప్రమాణాలు పెంచుకోగలిగామని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఏఐకేఎం కేఎస్ జాతీయ కో–కన్వీనర్ సింహాద్రి ఝాన్సీ అన్నారు. రంపచోడవరంలో సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నాయకులు కుంజం రాజు, మడెం లక్ష్మయ్యల వర్ధంతి సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టు పునరావాస, భూ హక్కుల సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల ప్రత్యేక సావనీర్–2024ను ఏజెన్సీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు ఇల్లా రామిరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. సర్పంచ్ వేట్ల విజయ, జోగారావు, బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ధరల దరువు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. నిత్యవసరాల ధరల నియంత్రణకు ప్రభుత్వం కనీసం చర్యలు చేపట్టడం లేదు. దీంతో ధరల ప్రభావం అటు మధ్య తరగతి ప్రజలతో పాటు పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులపై కూడా పడుతోంది. అరకులోయ మండలంలోని 135 ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు-2, ప్రభుత్వ ఉన్నత పాఠశాల-1.. మొత్తం 5,318 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజనాన్ని ప్రతీ రోజు అందజేస్తున్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ప్రభుత్వ విధానాల వల్ల 138 పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు తీవ్ర నష్టపోతున్నారు. సక్రమంగా బిల్లులు చెల్లించడం లేదని, బిల్లుల్లో కూతలు విధిస్తున్నారని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సక్రమంగా అందని బిల్లులు.. పెండింగ్‌లో నిధులు

కూటమి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పప్పులు, ఉప్పులు, కూరగాయలు కొనుగోలు చేయలేక అరువు తీసుకుంటూ చిన్నారులు ఆకలితో అలమటించకుండా తప్పని పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాల్సి వస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. బిల్లులు ప్రతీ నెల చెల్లించకపోవడంతో అప్పుల పాలతున్నామని వాపోతున్నారు. మెనూ ప్రకారంగా భోజనాలు పెట్టాలని ఆదేశిస్తున్న ప్రభుత్వం మెనూ చార్జీలు మాత్రం పెంచకపోగా, సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో నిర్వహణ కష్టతరంగా మారుతోందని, ఆర్థిక భారం మరింత పెరుగుతోందని చెబుతున్నారు. మధ్యాహ భోజన పథకానికి చెల్లించాల్సిన నిధులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. దాదాపు నాలుగైదు నెలలు నుంచి చెల్లించాల్సిన బిల్లులు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గౌరవ వేతనం కూడా పెండింగ్‌లో ఉందని, దీంతో వారి కుటుంబపోషణ కష్టతరమైతోందని నిర్వాకులు వాపోతున్నారు.

మధ్యాహ్నం.. అప్పుల భోజనం



- అరకొర నిధులు
- పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు
- పెరగని మెనూ చార్జీలు
- ఆర్థిక ఇబ్బందుల్లో నిర్వాహకులు

అరకులోయ టౌన్: విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసర సరకుల ధరలు మంట పుట్టిస్తున్నాయి. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ప్రభుత్వం బడ్జెట్ పెంచకపోగా నెలవారీ బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదు. పథకం పేరు మార్చిన ప్రభుత్వం మెనూ చార్జీలు మాత్రం పెంచలేదు. దీంతో నిర్వాహకులు నానా అవస్థలు పడుతున్నారు.



డైనింగ్ హాల్ లేక ఆరుబయట భోజనాలు చేస్తున్న విద్యార్థులు

ధరలు పెరిగినా పాత చార్జీలే

ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగినా.. పాత చార్జీలనే ప్రభుత్వం అమలు చేస్తోంది. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.5.88లు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ. 8.57 ఇస్తోంది. ఇలా అతి తక్కువగా చెల్లిస్తుంటే ఎలా సరకులు కొనుగోలు చేసి వండి వడ్డించాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వాపోతున్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా ప్రతీ నెల వారీ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

నిధులు విడుదల కాగానే చెల్లిస్తాం

మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఆగస్టు నెల బిల్లులు ప్రభుత్వం చెల్లించింది.. సెప్టెంబర్ అక్టోబర్ నవంబర్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే వంట కార్మికులకు బిల్లులు, వారి గౌరవ వేతనం వారి అకౌంట్‌లకు జమ అవుతుంది

– త్రినాథరావు, ఎంఈవో, అరకులోయ

గత ప్రభుత్వంలో ఇబ్బంది లేదు

గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు మెనూ చార్జీలు మార్పులు చేర్పులు చేస్తుండేది. దీంతో వంట ఏజేన్సీలైన మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెనూ చార్జీల పెంపు, బిల్లుల చెల్లింపు తదితర విషయాలను కనీసం పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పథకం పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ ధరల నియంత్రణలో లేదని ఎద్దేవా చేస్తేన్నారు. దీంతో వంట ఏజేన్సీలపై అధిక ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెనూ చార్జీలు పెంచాలి

ప్రభుత్వం 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.5.88 రుపాయలు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 8.57 చెల్లిస్తోంది. గతంతో పోల్చితే మూడింతలు పెరిగిన ధరలకు పప్పులు, నూనె, కూరగాయలు కొనుగోలు చేసి ఎలా భోజనాలు పెట్టగలం. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలి.

– కొర్రా కమల, మిడ్డే మీల్స్ నిర్వాహకురాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అరకులోయ

స్వీయ రక్షణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక శాఖ ఆధ్వర్యంలో మహిళల స్వీయ రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టబ్బాయి మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు అత్యవసర పరిస్థితుల్లో అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే తక్షణమే మహిళ సాధికారిత హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలన్నారు. స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.ఎస్.రసూల్, మహిళ సాధికారిత శాఖ సమన్వయకర్త పి.సౌజన్య, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అడ్డతీగల: అడ్డతీగలలోని ఎల్లవరం సొసైటీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటలకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు మండల వ్యవసాయాధికారి సువర్ణకుమారి తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఈ కొనుగోలు కేంద్రం వద్ద అమ్ముకోవచ్చన్నారు.

కాలుష్య నివారణకు కృషి

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ ఆదేశాల మేరకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజ్ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ మేరకు విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. అధ్యాపకులు సుందరిరాణి, ఎన్ఎస్ఎస్ పీవో వై. విజయలక్ష్మీ మాట్లాడుతూ గిరి గ్రామాల్లో కాలుష్య నియంత్రణపై వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. అధ్యాపకుడు గణేష్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజ్

వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

గూడెం కొత్తవీధి: వారపు సంతల్లో నిల్వ మాంసాలు, నాణ్యత లేని నిత్యావసరాలు, పర్యావరణానికి హాని చేసే పాలిథిన్ కవర్లు వంటివి విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. ఆర్వీ నగర్ వారపు సంతలో సోమవారం పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణతో కలసి సంతలో తనిఖీలు నిర్వహించారు. డిసెంబరు 1 నుంచి పూర్తిగా పాలిథిన్ కవర్లను నిషేధించామన్నారు. అయినా నిబంధనలు పాటించకుండా కొందరు వ్యాపారులు కవర్ల అమ్మడాన్ని గుర్తించి ఒక వ్యాపారికి రూ.5వేల అపరాధ రుసుం విధించినట్టు ఎంపీడీవో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఆర్వీ నగర్ వారపు సంతలో వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

సీపీఎం మహాసభల పోస్టర్ విడుదల

గూడెంకొత్తవీధి: పాడేరులో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బుజ్జిబాబు, నాయకులు సత్యనారాయణ కోరారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈనెల 4న పాడేరులో జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు బాలయ్య, చంటిబాబు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


కొయ్యూరు: మండలంలోని తులబాడలో సీపీఎం నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ప్రసాద్, చిట్టిబాబు తదితరులు మాట్లాడుతూ ఆదివాసీ హక్కులను కూటమి ప్రభుత్వం పటిష్టంగా అమలుచేయాలని, జీవో నెంబర్–3కు చట్టబద్ధత కల్పించాలని, పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణం కోసం పీవీటీజీలకు రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాడేరులో 4న జరగనున్న సభలను విజయవంతం చేయాలని కోరారు. నేతలు అప్పారావు, జోసఫ్, నాని, శైలజ, సావిత్రి పాల్గొన్నారు



మహాసభల పోస్టరును ఆవిష్కరిస్తున్న నాయకులు

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం


జి.మాడుగుల: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని పాడేరు ఎక్సైజ్ సీఐ ఆచార్య హితవుపలికారు. మండలంలోని వంజరి పంచాయతీ కిముడుపల్లి గ్రామాన్ని ఆయన సోమవారం సందర్శించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అయన మాట్లాడుతూ డ్రగ్స్, సారా, గంజాయి వల్ల జీవితాలు నాశనమవుతాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. యువత బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కిముడుపల్లిలో మాట్లాడుతున్న పాడేరు ఎక్సైజ్ సీఐ ఆచార్య

1600 లీటర్ల పులుపు ధ్వంసం

చింతపల్లి: మండలంలో సారా తయారీకి ఉపయోగించే 1600 లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కూర్మారావు తెలిపారు. విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు మేరకు అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.వి. నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలో గల పెదగొంది, రబ్బరగొంది గ్రామాల్లో సోమవారం దాడులు నిర్వహించినట్టు చెప్పారు. ఈ దాడుల్లో 1600 లీటర్లు పులుపును ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో నర్సీపట్నం చింతపల్లి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సారా పులుపును ధ్వంసం చేసిన ఎక్సైజ్ పోలీసులు

యూటీఎఫ్ ప్రతినిధులకు అభినందనలు

గంగవరం: అరకులోయలో ఇటీవల జరిగిన యూటీఎఫ్ జిల్లా కమిటీ నూతన కార్యవర్గంలో మండల ఉపాధ్యాయులకు స్థానం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్‌గా రుక్మిణిదేవిని ఎన్నుకున్నారు. దీనిపై మండల యూటీఎఫ్ ప్రతినిధులు రాంబాబు, వెంకటేశ్వరరావు, సాయిబాబా, రఘుబాబు, బుజ్జి , రామకృష్ణారెడ్డి, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభ, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

చింతూరు: ఎటపాక మండలం పూసుగూడెం, చింతలపాడు, ఎర్రగుంటపాడు గ్రామాలకు చెందిన గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయా గ్రామాల గిరిజనులతో కలసి స్థానిక ఐటీడీఏ ఎదుట ఆమె ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు నిర్మించాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అచ్యుతాపురంలో ఆలుగువాగు ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురైన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భీమరాజు, జోగారావు, ఇర్మయ్య, రుద్రమ్మ, రాజమ్మ, లక్ష్మీదేవి, హరిబాబు పాల్గొన్నారు.

అంతర్ కళాశాల పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులు ఓంకార్, రమేష్

చింతపల్లి: చింతపల్లి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు విశాఖలోని ఏయూలో ఇటీవల జరిగిన అంతర్ కళాశాల అథ్లెటిక్ మీట్‌లో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి చెప్పారు. కళాశాల విద్యార్థులు తగ్గి ఓంకార్ ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, పాంగి రమేష్ జావెలిన్‌త్రోలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి, ఫిజికల్ డైరెక్టర్ శివరాం కుమార్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: మండలంలో రాత్రిపూట జరుగుతున్న దొంగతనాల పట్ల మండల వాసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జె.రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మండలంలో జరుగుతున్న దొంగతనాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. రాత్రిల్లు పెట్రోలింగ్ చేస్తున్నామని, తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ప్రజలంతా దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానస్పదంగా ఎవరైనా తిరిగినా తమకు సమాచారం ఇవ్వాలని, అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దని సూచించారు. రాత్రి 11 గంటల తరువాత ఎవరూ బయట తిరగొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అందరి సహకారంతో దొంగతనాలు అరికట్టవచ్చన్నారు. వీలైతే దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని, రాత్రిళ్లు ఇంటి బయట విద్యుత్ దీపాలు వెలిగించే ఉంచాలని సూచించారు. ఏఎస్‌ఐలు తిరుపతిరావు,లక్ష్మణరావులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం

దుంబ్రిగుడ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రాంబాబు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌టీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశలున్నాయని, వ్యాధుల నియంత్రణలో ప్రజలకు అందుబాటులో ఉంటూ రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని వ్యాధుల నియంత్రణకు తోడ్పాటునివ్వాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించకుండా వైద్యసేవలు అందేలా చూడాలని సూచించారు. ఎంపీఈహెచ్‌వో శౌరీ, పిహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న వైద్యాధికారి రాంబాబు

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

జి.మాడుగుల: మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ కేంద్రంలో గ్యాస్ లీకై పెంకుటిల్లు దగ్ధమైన ఘటనలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు దువ్వాడ శ్రీ కుసుమహరనాథ నామ ప్రచార సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరకులు, వంట సామగ్రి, దుస్తులు, దుప్పట్లను అందజేశారు. కె.కోడాపల్లి గ్రామంలో గ్యాస్ లీకై దగ్ధమైన పెంకుటిల్లును సంఘ సభ్యులు రమేష్, విజయ్‌కుమార్, రాము, దివాకర్‌లు పరిశీలించారు. అనంతరం అగ్ని ప్రమాద బాధితులు సోమెలి సింహాచలం, భాస్కరరావులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. సర్పంచ్ మాతే చిలకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాతే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కె కోడాపల్లిలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు వంట సామగ్రి, నిత్యావసర సరకులు, దుప్పట్లు, దుస్తులు అందజేస్తున్న దాతలు

సాంకేతిక విద్య అవసరం

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ డిజిటల్ లిటరసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాల కంప్యూటర్స్ అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం, ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె వసుధ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక విద్య ప్రతి ఒక్కరికి అవసరమనానరు. కంప్యూటర్ పరిజ్ఞానం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు శివకుమారి, చక్రవర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: నేటి తరం విద్యార్థులకు సాంకేతిక విద్య ఎంతో అవసరమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ అన్నారు. వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే సందర్భంగా సోమవారం స్థానిక కేజీబీవీలో విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సాంకేతిక విద్యపై మక్కువ పెంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అధ్యాపకులు రమేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ

భారీ అన్నసమారాధన

పాడేరు రూరల్(అరుకులోయ రూరల్): మండల కేంద్రంలోని పూర్ణ పుష్కల అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు, ఆలయ గౌరవ అధ్యక్షుడు వర్తన పిన్నయ్య దొర, కార్యదర్శులు అనిల్, రాము, సత్తిబాబు, కోశాధికారి ఆదిత్య, దాము, ప్రచార కార్యదర్శులు ఈశ్వరరావు, ప్రశాంత్, కొండబాబు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



రాజవొమ్మంగిలోని అన్నదానంలో భక్తులు



అరకులోయలో అన్నదానంలో కమిటీ సభ్యులు

రాజవొమ్మంగి: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.